# కిడ్నాప్

**కట్టా రాంబాబు**

**తె**ల్లారేసరికి ఆవార్త గుప్‌మంది.

ఆవూరి హెడ్మాష్టరుగారి బాలింత కుక్క, దాని మూడు పిల్లలు తెల్లారేసరికి కన్పించడంలేదట. ఎవరో ఎత్తుకు పోయుంటారని అంతా అనుకుంటున్నారు.

ఎవరెత్తుకెళ్ళుంటారో ఎంతకీ అంతుబట్టలేదు. ఆయన మీద కోపంతో ఎవరైనా ఆపని చేసుంటారా అంటే అలా అనుకోవడానికి కూడా లేదు. ఆవూళ్ళో ఆయనకు అజాత శత్రువని పేరు. అందరి తలలో నాలుకలా వుంటారాయన. ఆకుక్కంటే యింటిల్లిపాదికీ ప్రాణంతో సమానం. ఈ మధ్యనే అది మూడు పిల్లల్ని పెట్టింది. అవంటే ఆయనగారి గారాల కూతురికి ఎంతో ఇష్టం. ఆ అమ్మాయి ఉదయం నుంచీ మంచినీళ్ళు కూడా ముట్టకుండా కంటికి మంటికి ఏకధాటిగా ఏడుస్తుంది. ఆయన భార్య అయితే మరీను. వార్త తెలిసిన ఆవిడ అసలు మంచమే దిగలేదు. చలి జ్వరం వచ్చిన దానిలా ముసుగేసుకుని పడుకుంది. ఒక్కతే కూతురు కావడంవల్ల ఆ కుక్కను రెండో కూతుర్లా పెంచిందావిడ.

హెడ్మాష్టరుగారికి కాలూ చెయ్యి ఆడటంలేదు. అప్పటికే ఆ స్కూలు టీచర్లు, ఆటెండర్లు అక్కడక్కడా వెదికి వచ్చారు. కాని ఎక్కడా వాటి జాడ కన్పించలేదు. ఇంక దొరకవని ఆయన ఆశ వదులుకున్నారు.

అన్యమనస్కంగానే ఆయన స్కూలుకొచ్చారు. ఆవూళ్ళో అప్పర్ ప్రైమరీ స్కూలుకి హెడ్మాష్టరుగా వచ్చారాయన. ఆపూట ఏమీ పాఠాలు చెప్పలేకపోయారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటర్వెల్లో యింటికి భోజనానికొచ్చారు. ఇంట్లో వంట చెయ్యలేదు. అంతా నిరాహారదీక్షలో వున్నారు. ఆ కుక్క దొరికేవరకు వంట చెయ్యనంది భార్య. కుక్కపిల్లలు దొరికే వరకు భోజనం చెయ్యనంది కూతురు.

ఏం చెయ్యాలో తోచలేదా హెడ్మాష్టరుకి. అభోజనంగానే మళ్ళీ స్కూలుకొచ్చారు. సరిగ్గా మూడు గంటల ప్రాంతంలో ఓ కుర్రాడొచ్చి హెడ్మాష్టరు చేతిలో ఓ కాగితం పెట్టి తుర్రుమన్నాడు. దాన్ని విప్పి చూసారాయన.

ప్రవర్తించడంలేదు. మమ్మల్ని ప్రతీ విషయం లోను పనిష్ చేస్తున్నారు. మా ప్రోగ్రెస్ కార్డుల్లో మార్కులు తక్కువగా వేసారు. మేం మూడు రోజుల క్రితం అల్లరి చేసామని స్కూలు నుండి పది రోజులపాటు సస్పెండ్ చేసారు. మీరు చేస్తున్న పనుల్ని మేం సహించలేక



''హెడ్మాష్టరుగార్కి! మీ స్కూల్లో ఏడవ తరగతి చదివే 7, 10, 12, 17, 25, 29, 35 నెంబర్లుగల విద్యార్థులు వ్రాయునది. మీ కుక్కను, దాని పిల్లల్ని మేమే కిడ్నాప్ చేసాం. ఎందుకో తెలుసా? మీరు మాపట్ల సక్రమంగా

పోతున్నాం. అందుకే మా నిరసనను మీ కుక్కల్ని కిడ్నాప్ చెయ్యడం ద్వారా తెలియజేస్తున్నాం. మీ కుక్కల్ని విడిచి పెట్టాలంటే మీరు మా సస్పెన్షన్ ఉపసంహరించుకోవాలి, మా ప్రోగ్రెస్ కార్డుల్లో

మార్కుల్ని మార్చాలి, ముందు ముందు మామీద ఎటువంటి చర్యలు తీసుకో కూడదు. వీటికి మీరు వప్పుకుంటే మీ కుక్కల్ని విడిచిపెడతాం. లేకపోతే వాటిని చంపేస్తాం. ఏ సంగతి సాయంత్రం ఐదు గంటలలోగా మన అటెండరు గంటన్న ద్వారా మన వూరు చివర పాడుబడ్డ దేవాలయం దగ్గర తెలియజేయవలెను. అతను ఒక్కడే రావాలి. కూడా ఎవరు వచ్చినా, ఈ విషయం ఎవరికి చెప్పినా మీ కుక్కలు మీకు దక్కవు. ఈ విషయం మా యిళ్ళలో తెలియజెయ్య కూడదు. ఏది జరిగినా మేం మాట నిలుపుకోలేము.

- ఇట్లు మీ విద్యార్థులు.''

ఆ ఉత్తరం చదివిన హెడ్మాష్టరుకు మతిపోయింది. కుక్కలు పోయిన దానికంటే చిన్న పిల్లల్లో 'కిడ్నాప్' అనే భావం ఎంత దగ్గరగా వచ్చిందో అని ఆయన బాధపడ్డారు. స్కూల్లో పనిచేస్తున్న ఇతర టీచర్లను పిలిచి తన గదిలో సమావేశపరిచి విషయం చెప్పారు.


అసలు ఈ విషయం ఎంతవరకు నిజమో ముందు గంటన్నను పంపి తెలుసుకుంటే మంచిదని అంతా అన్నారు. ఒక కిలోమీటరు దూరంలో వుందా దేవాలయం. గంటన్న సైకిలు మీద వెళ్ళివచ్చాడు. కుక్కలతో ఆ విద్యార్థులు దేవాలయంలోవున్నారని చెప్పాడు. అయితే ఇప్పుడేం చెయ్యాలా అని అంతా ఆలోచనలో పడ్డారు. వాళ్ళ సమస్యను ఉపసం హరించుకుంటే సరిపోతుందని హెడ్మాష్టరుకు నచ్చచెప్పి తిరిగి గంటన్నను పంపించారు.

గంటన్న వాళ్ళతో ఆ విషయం చెపితే వాళ్ళు వినలేదు. తాము కోరినవన్నీ జరిగితేనే కుక్కల్ని విడిచిపెడతామని, అంతే కాకుండా వాటిని తీసుకొచ్చినందుక్కూడా తమమీద ఎటువంటి చర్య తీసుకోకూడదని షరతు విధించారు. ఓ కుక్కపిల్ల ఉదయం నుంచీ తుమ్ముతూ, దగ్గుతూ వుందని దాన్ని తీసుకెళ్ళి ఇచ్చెయ్యమని గంటన్న చేతికిచ్చారు. ఆ విషయం స్కూల్లో చెప్పి గంటన్న ఆ కుక్కపిల్లని హెడ్మాష్టరు యింట్లో ఇచ్చాడు. ఆ పిల్లను చూసిన ఆనందంతో హెడ్మాష్టరుగారి అమ్మాయి తన నిరాహార దీక్షను కొద్దిగా సడలించి గుక్కెడు మంచినీళ్ళు తాగి ఆపిల్లను కుక్కల డాక్టరు దగ్గరకు తీసుకుపోయింది.

మళ్ళీ ఆలోచనలో పడ్డారంతా. వాళ్ళు చెప్పినవన్నీ వింటే ముందు ముందు క్రమ శిక్షణ విషయంలో చాలా ఇబ్బందులొస్తాయి. పోనీ కుక్కలే కదా విడిచిపెట్టేద్దామంటే అవంటే యింట్లో అందరికి ప్రాణం. అవి దొరక్కపోతే యింట్లో ప్రళయం వస్తుంది. హెడ్మాష్టరు ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు కబురుపెట్టి పిలిపించారు. వాళ్ళు అంతావిని చాలా బాధపడ్డారు. తామెళ్ళి వాళ్ళను చితకబాది తీసుకొస్తామన్నారు. కాని అది పద్ధతి కాదని, కుక్కలకు హాని తలపెట్టవచ్చని వాళ్ళని వారించారు. ఆయనే కాస్సేపు ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చారు.

గంటన్నను పిలిచి వాళ్ళ అన్ని షరతులకు వప్పుకున్నామని, వాళ్ళని, కుక్కల్ని తీసుకు రమ్మని పంపించారు. వాళ్ళొచ్చింతర్వాత ఎవరూ వాళ్ళని ఏమీ అనవద్దని, తనే వాళ్ళతో మాట్లాడతానని చెప్పారు.

గంట తర్వాత ఆ విద్యార్థులు కుక్కలతో సహా వచ్చారు.




ఆ కుక్కలకి ఉదయం నుంచీ తిండిలేదేమో సోలిపోయి వున్నాయి.

వాటిని యింటికి పంపించేసారు. వాళ్ళు కూడా ఏమీ తిన్నట్లు లేదు. వాళ్ళ ముఖాలు కూడా అలాగే వున్నాయి. వాళ్ళకి టిఫిన్ తెప్పించి పెట్టారు. వాళ్ళందర్నీ తన రూములో కూర్చోపెట్టి మిగతావాళ్ళని బయట వుండమని చెప్పారు.

హెడ్మాష్టరుగారు తన కుర్చీలో కూర్చుని వాళ్ళవంక చూసారు.

వాళ్ళ ముఖాల్లో కొద్దిగా భయం చోటు చేసుకుని వుంది.

"నేను మిమ్మల్ని బాధపెడుతున్నానని, సస్పెండ్ చేసానని, ప్రోగ్రెస్ కార్డుల్లో మార్కులు తక్కువ వేసానని అభియోగం చేసారు. అలా చెయ్యడంలో నా తప్పేమిటో నాకర్థం కావడంలేదు. రెండు వందల మంది విద్యార్థులున్న ఈ స్కూల్లో మీరే కొంచెం అల్లరి చిల్లరిగా ప్రవర్తిస్తున్నారు. మిమ్మల్ని అలా వదిలేస్తే మిగతా విద్యార్థులు మిమ్మల్ని చూసి అలా తయారవ్వడానికి అవకాశం వుంది. మన స్కూలు క్రమశిక్షణ దెబ్బతింటుంది. అసలు మిమ్మల్ని విడిచిపెట్టేస్తే మీరు చెడిపోయే అవకాశం కూడా వుంది.

మీలో ఇప్పుడు మార్పు రాకపోతే భవిష్యత్తులో మిమ్మల్ని మార్చడం ఎవరి తరమూ కాదు. అందుకే అప్పుడప్పుడు మిమ్మల్ని పనిష్ చేస్తున్నాను.

మిమ్మల్ని సస్పెండ్ చేసాను. నిజమే. అలా ఎందుకు చెయ్యవలసి వచ్చింది? మీ క్లాసు అమ్మాయిల్ని మీరు అసభ్యకరమైన పాటలు పాడి టీజ్ చేసారు. అసలు మీ వయస్సు ఎంత? మీలో అలాంటి ఆలోచనలు ఎందుకు వస్తున్నాయి? సినిమాలు, టీవీలు చూసి మీరిలా తయారవుతున్నారు. మిమ్మల్నిప్పుడు విడిచిపెట్టేస్తే ముందు ముందు ఇంకా పెద్ద పనుల జోలికెళతారు. అలా చెయ్యడం

తప్పని చెప్పడం కోసమే మిమ్మల్ని సస్పెండ్ చేసాను. మీరు సరిగ్గా చదవడంలేదు. పరీక్షల్లో మార్కులు తక్కువొస్తున్నాయి. అదే విషయాన్ని ప్రోగ్రెస్ కార్డుల ద్వారా తెలియజేసాను. కనీసం మీ విషయాన్ని మీ యింట్లో వాళ్ళకి తెలియజెయ్యవలసిన బాధ్యత నాకుంది. దానికి ప్రతీకారంగా మీరు నా కుక్కల్ని కిడ్నాప్ చేసారు. దానివల్ల మీరు తాత్కాలికంగా ఏదైనా ప్రయోజనం పొందితే పొందొచ్చు.

కిడ్నాప్ అనేది పిరికివాళ్ళు చేసేపని. ఇది అందరికీ అలవాటయిపోయింది. తాము చెయ్యలేని పనిని కిడ్నాప్ ద్వారా సాధించుకుంటారు. మీరు ధైర్యంగా ఈ విషయాలు నాతో మాట్లాడివుంటే మీకు అన్నీ విడమరచి చెప్పేవాణ్ణి. నిజంగా ఒక విషయానికి మిమ్మల్ని మెచ్చుకోవాలి. ఇలా అయినా మీ సమస్యను తెలియజేయగలిగారు. ఈ ఉదంతంవల్ల మీలో తెలివి తేటలు న్నాయని, ధైర్యంగా ఏపనయినా చెయ్యగలరని తెలుస్తుంది. దానిని చదువులోను, మంచి మంచి కార్యక్రమాల్లోను ఉపయోగించండి. పైకొస్తారు. అంతేగాని ఇటువంటి వాటికుపయోగిస్తే మాత్రం తప్పకుండా చెడిపోతారు. మీకు బోలెడంత భవిష్యత్తుంది. బాగా చదవండి. అల్లరి చెయ్యడం అనేది ఈ వయసులో సహజమే. అయితే అది ఇతరులను బాధించేదిగా వుండకూడదు.

సరే జరిగిందేదో జరిగిపోయింది. మిమ్మల్ని సస్పెండ్ చేసే అధికారం నాకుంది. అలాగే దాన్ని ఉపసంహరించే అవకాశం కూడా వుంది. కాబట్టి మీరు మారతారనే ఉద్దేశంతో దాన్ని ఉపసంహరించుకుంటాను. రేపటి నుంచీ స్కూలుకు రండి. ప్రోగ్రెస్ కార్డులంటారా అవి మార్చడానికి వీలుండదు. ఇప్పటికే వాటిని మీ తల్లిదండ్రులకు పంపడం జరిగింది. మీరు మీరు యిళ్ళకు వెళ్ళండి. మీ తల్లిదండ్రులు ఈ విషయంలో మిమ్మల్నేం అడగరు. రేపటి నుంచీ మంచి విద్యార్థుల్లా ఈ స్కూల్లో వుంటారని ఆశిస్తాను'' అని మెత్తగా మందలించారు.

విద్యార్థుల ముఖాల్లో ఆలోచన కన్పించింది. అది పసిగట్టి ఆయన ఆనందంగా ఫీలయ్యారు.

అయితే ఆ విద్యార్థులకు అర్థంకానిదొక్కటే. ప్రభుత్వ అధికారులను, ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేస్తే ప్రభుత్వం గడగడలాడిపోతుంది కదా. మరి తాము చేస్తే ఇలా జరిగిందేమిటబ్బా అనుకున్నారు. ★

